# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




సంచిక : 4 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శనివారం | 5-4 -2025 | వెల : .రూ. 5.00




## వక్ఫ్ బిల్లు ఆమోదంపై ప్రధాని హర్షం

➤ చారిత్రాత్మక మలుపు అని పేర్కొన్న మోడీ


న్యూఢిల్లీ, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
వక్ఫ్ సవరణ బిల్లు-2025 ఎట్టకేలకు పార్లమెంటు ఆమోదం పొందడంతో ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రక ఆవశ్యకత ఉన్న బిల్లు అని తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత చర్చతో పాటు-అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాల నడుమ ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించాయి. తొలుత బుధవారం సుదీర్ఘ చర్చ -మిగతా 2 లో



## పకడ్బందీగా ఇంటర్మీడియట్ మూల్యాంకనం

మొత్తం 19 సెంటర్లల్లో ఏప్రిల్ 10వ తేదీ వరకు మూల్యాంకనం

హైదరాబాద్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతున్న సంగతి తెలిసిందే. మొత్తం 19 సెంటర్లల్లో ఏప్రిల్ 10వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగనుంది. అయితే -మిగతా 2 లో



## గ్రూప్-1 నియామకాలుకు లైన్‌క్లీయర్

జీవో 29 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
గ్రూప్-1 నియామకాలుకు లైన్‌క్లీయర్ అయ్యింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీవో 29 చెల్లుబాటును సవాల్ చేస్తూ గ్రూప్ 1 అభ్యర్థులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను -మిగతా 2 లో



## తెలంగాణలో మెరుగైన విద్యావ్యవస్థ

### రూపకల్పన పై ప్రభుత్వం దృష్టి





➤ క్షేత్రస్థాయి పరిశీలనతో పాలసీ రూపొందించాలి
➤ మేధావులు, అధికారులు, ఎన్జీవోలత సమీక్ష
➤ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్ ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన విద్యావ్యవస్థ రూపకల్పనకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడమని సీఎం తెలిపారు. మనకు ఉన్న వనరులు -మిగతా 2 లో

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్. గౌతమ్ రావు

ఈనెల 23న పోలింగ్..25 ఫలితాలు




హైదరాబాద్,
హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరును పార్టీ అధిష్టానం శు క్రవారం ప్రకటించింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్.గౌతవమ్ రావు పేరును ఖరారు చేసింది -మిగతా 2 లో



## రేషన్ కార్డుదారులకు కేంద్రం శుభవార్త

ఇకెవైసీ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

హైదరాబాద్ ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రేషన్ కార్డుదారులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ కార్డుదారుల కోసం ఇకెవైసీ ఈ పక్రియ గడువును మళ్లీ పొడిగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు దీనిని పొడిగించినట్లు- ప్రకటించింది. అసలు అయితే మార్చి 31వ తేదీ వరకు ఈ గడువు విధించిన సంగతి తెలిసిందే. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారులకు సబ్సిడీ పంపిణీలో పారదర్శకతను నిర్ధారించడం..అలాగే అర్హత లేని వ్యక్తుల దుర్వినియోగాన్ని నివారించడం -మిగతా 2 లో



## అమెరికన్ గోల్డ్ కార్డుకు భారీగా స్పందన

➤ ఇప్పటికే వేయి కార్డులు జారీ అయినట్లు సమాచారం
➤ ట్రంప్ విధానాలతో హెచ్-1 వీసాదారుల్లో భయం
➤ దేశం విడిచి వచ్చేందుకు వెనుకంజ

వాషింగ్టన్ ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే గోల్డ్ కార్డు ఆఫర్ ప్రకటించిన వెంటనే భారీగా స్పందన వస్తోంది. ఆదాయం పెంచుకునేందుకు ట్రంప్ వేసిన ఎత్తుగడలు ఫలిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు వెల్లడించాక పలువురు ఆసక్తి చూపుతున్నారు. 5 మిలియన్ డాలర్లు అంటే సుమారు 44 కోట్లు చెల్లించగలిగే -మిగతా 2 లో

## జింకలపై కుక్కల దాడి ఎంతో కలిచివేసింది

➤ గతంలో ఇలాంటి ఘటనలు చూశామా..?
➤ మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్,
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కుక్కల దాడిలో ఓ జింక ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఎంతోగానో కలిసివేసిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇదివరకు ఇలాంటి ఘటనలు -మిగతా 2 లో

## హెచ్‌సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు

సచివాలయంలో మంత్రుల కమిటీ భేటీ



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కార్యాచరణ

హైదరాబాద్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
హెచ్‌సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై శుక్రవారం సచివాలయంలో మంత్రుల కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సీఎస్ శాంతికుమారి భేటీ అయ్యారు. ఇప్పటికే ముగ్గురు మంత్రులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీలో భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుంటామని -మిగతా 2 లో



## హిందువుల రక్షణపై దృష్టి పెట్టండి

బంగ్లా నేతకు ప్రధాని మోడీ హెచ్చరిక లాంటి సూచన

బ్యాంకాక్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని భారత్ కోరింది. ఈ మేరకు థాయిలాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌తో భేటీలో నిర్మొహమాటంగా ఈ విషయం చెప్పారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా అధికారంలోకి -మిగతా 2 లో

# తెలంగాణలో మెరుగైన విద్యావ్యవస్థ

(మొదటి తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని సీఎం సూచించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధానపత్రం ఉండాలని,అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలని సీఎం హితవు పలికారు.ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు.. తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫాంల పంపిణీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని.. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ప్రాథమిక విద్య స్థాయిలో ఎలాంటి సంస్కరణలు అవసరమన్న అంశంపై చర్చించారు. జీవన ప్రమాణాలు పెంచే విధంగా విద్యావిధానం ఉండాలని అధికారులకు సూచించారు. భాషతోపాటు–, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరిగేలా ఈ పాలసీ ఉండాలన్నారు. ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం ఎంత ఖర్చయినా కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడబోదన్నారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సీఎం సూచించారు. వివిధ రాష్ట్రాల్లోని పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ప్రస్తుతం వరకు విద్యా వ్యవస్థలోని తీసుకువచ్చిన పలు సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనా ధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వివరించారు. విద్యా వ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేష్, కె.జ్యోత్స్న శివారెడ్డి, పలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ పలు కీలక సూచనలు చేశారు. విద్యా వ్యవస్థలో 1960 నుంచి చోటు– చేసుకున్న మార్పులు ఏవిధంగా నష్టం కలిగించాయో వివరించారు. బోధన ప్రమాణాలు ఏవిధంగా ఉండాలన్న దానిపై పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు– సీనియర్ నేత కె.కేశవరావు కూడా కొన్ని సూచలను చేశారు. వీటన్నింటినీ క్రోడీకరిస్తూ ఆచరణయోగ్యమైన పాలసీని తయారు చేయాలని సీఎం విద్యాశాఖను ఆదేశించారు.

## రేషన్ కార్డుదారులకు కేంద్రం శుభవార్త

(మొదటి తరువాయి)

కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పొడిగింపు వల్ల ఇప్పటి వరకు ఈ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు ఏప్రిల్ 30 వరకు ఈ పక్రియను పూర్తి చేసుకోవచ్చునని సూచించింది. అధికారులు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఎందుకంటే మరోసారి గడువు పొడిగించే అవకాశం ఉండక పోవచ్చని వివరిస్తున్నారు. ।–ఔ<ఈ పూర్తి చేయని వారి రేషన్ కార్డులు రద్దు కావచ్చునని స్పష్టం చేస్తుంది. దీని వల్ల ఉచిత రేషన్ సౌకర్యం కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ విషయంలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా ప్రచారం నిర్వహిస్తోంది. ।ఈ పక్రియను సులభంగా పూర్తి చేయడానికి రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లను సంప్రదించవచ్చునని కేంద్రం స్పష్టమైన వివరణ ఇచ్చింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అందుకు గడువు సైతం విధించింది. ఈ గడువు పూర్తయిన వెంటనే.. ప్రభుత్వ సిబ్బంది విచారణ చేపట్టి.. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు– ఒక్క రేషన్ కార్డు సైతం మంజూరు చేయలేదంటూ ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డు మంజూరు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం విదితమే

## జింకలపై కుక్కల దాడి ఎంతో కలిచివేసింది

(మొదటి తరువాయి)

ఎప్పుడైనా హెచ్‌సీయూలో చూశామా అని కాంగ్రెస్‌ను ఆయన నిలదీశారు. ఈ రక్తపు మరకలు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేతికే అంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. అత్యాశతో కూడిన కాంగ్రెస్ ప్రభుత్వం జింకలకు నెలవైన కంచ గచ్చిబౌలి భూములను ధ్వంసం చేసింది. దీంతో ఆ ప్రాంతంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ జింకను చంపాయి. కంచ గచ్చిబౌలి మినీ ఫారెస్ట్‌ను రేవంత్ రెడ్డి బుద్ధిహీనంగా ధ్వంసం చేయడం వల్ల విలువైన వృక్ష, జంతుజాలం నష్టపోయింది అని కేటీఆర్ పేర్కొన్నారు. వన్యప్రాణుల ఈ దారుణ హత్యపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టును అభ్యర్థిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. కంచ గచ్చిబౌలిలో 100 ఎకరాల్లో చెట్లను నరికివేయడంతో.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ హాస్టల్ వైపు జింక వచ్చింది. జింకను చూసిన కుక్కలు మొరుగుతూ.. దానిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను హెచ్‌సీయూ విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది.. వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. జింకకు తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో అది చనిపోయింది. ఇక చాలా జింకలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆ జింకలను జనాలు చేరదీసి.. వాటికి నీళ్లను అందిస్తున్నారు. మూడు రోజుల్లో 100 ఎకరాల్లో పచ్చని చెట్లను నరికివేయడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై జనాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే విధంగా రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

# అమెరికన్ గోల్డ్ కార్డుకు భారీగా స్పందన

(మొదటి తరువాయి)

వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని ఇస్తున్నారు. ట్రంప్ ప్రకటించిన ఈ గోల్డ్ కార్డుకు అమెరికాలో భారీ స్పందన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా గోల్డ్ కార్డుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అధ్యక్షుడు విడుదల చేశారు. ట్రంప్ చిత్రంతో ఉన్న ఈ గోల్డ్ కార్డును ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడే సమయంలో చూపించారు. ఈ గోల్డ్ కార్డును 5 మిలియన్ డాలర్లు చెల్లించి ఎవరైనా సొంతం చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాదు ఈ గోల్డ్ కార్డును తానే మొదట కొనుగోలు చేసినట్లు ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రకటించారు. రెండో కొనుగోలుదారు ఎవరో తనకు తెలియదని చెప్పారు. ఈ గోల్డ్ కార్డు రెండు వారాల్లో అమ్ముడ యిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పౌరసత్వ కార్డుల ద్వారా వేగంగా జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని కొంత వరకు తగ్గించవచ్చన్న అభిప్రాయంలో ట్రంప్ ఉన్నారు. ఈ క్రమంలో ఈబీ–5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్డ్ కార్డు ఆఫర్లను ప్రకటించారు. ఈబీ–5 ప్రోగ్రామ్ ద్వారా అమెరికాలో పెట్టు–బడి పెట్టే విదేశీయులకు గ్రీన్ కార్డు ఇస్తారు. గోల్డ్ కార్డులను అమ్మనున్నామని, 5 మిలియన్ల డాలర్లకే ఆ కార్డును ఇవ్వనున్నట్లు– ట్రంప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించారు. ట్రంప్ ప్రకటనతో ఈ గోల్డ్ కార్డులకు భారీ గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం ఒక్కరోజులోనే ఏకంగా 1,000 గోల్డ్ కార్డులు విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ ఇటీ–వలే వెల్లడించారు. వీటి ద్వారా దాదాపు 5 బిలియన్ డాలర్లు సేకరించినట్లు– తెలిపారు. 'ప్రపంచ వ్యాప్తంగా 37 మిలియన్ల మందికి గోల్డ్ కార్డును కొనుగోలు చేయగల సామర్థం ఉంది. ఒక మిలియన్ మంది వీటిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉంది' అని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ గోల్డ్ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ.. అధ్యక్షుడు ట్రంప్‌దే అని బదులిచ్చారు. 'పెట్టుబడిదారు జాన్ పాల్సన్‌తో జరిగిన సమావేశంలో ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచన ఇది. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే నా బాధ్యత. ఇందుకోసం నా వద్ద ప్రణాళిక ఉంది' అని చెప్పుకొచ్చారు. ఇకపోతే అమెరికా వలస విధానాల్ని మరింత కఠినతరం చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వలసదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్వదేశానికి వెళ్తే.. తిరిగి అమెరికాకు రానిస్తారా? లేదా? అన్నదానిపై హెచ్1బీ వీసాదారులలో అనుమానాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రఖ్యాత టెక్ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. తమ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్1బీ వీసాదారులను అప్రమత్తం చేస్తూ.. దేశాన్ని వీడొద్దని సూచించాయి. మళ్లీ అమెరికాకు తిరిగిరావడానికి అనుమతి ఉంటుందో? లేదోననే అనుమానాలు ఉన్నందున.. ఈ హెచ్చరికలు జారీచేస్తున్నట్టు సదరు కంపెనీలు పేర్కొన్నాయి. అమెరికాను వీడొద్దంటూ ఆయా ఐటీ కంపెనీలు తమ సిబ్బందికి ఇప్పటికే సూచించాయి. దీంతో భారత్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నట్టు పలువురు హెచ్1 బీ వీసాదార్లు చెప్పినట్టు 'వాషింగ్టన్ పోస్ట్' కథనం పేర్కొన్నది. ఒకవేళ చట్టాన్ని మార్చితే, వలసదార్ల పిల్లల పౌరసత్వం అగమ్యగోచరంగా మారేట్టు ఉందని ఒకరు వాపోయారని వార్తా కథనం తెలిపింది.

## హిందువుల రక్షణపై దృష్టి పెట్టండి

(మొదటి తరువాయి)

వచ్చిన తర్వాత తొలిసారి మహ్మద్ యూనస్, భారత ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. థాయ్‌లాండ్ బ్యాంకాక్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో ఇరువురు నాయకులు సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య సానుకూల, నిర్మాణాత్మక సంబంధం అవసరారన్ని ప్రధాని మోడీ యూనస్‌కి తెలియజేశారు. అదే సమయంలో పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటాన్ని నివారించాలని కోరారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ విలేకరుల సమావేశంలో చెప్పారు. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల గురించి యూనస్ వ్యాఖ్యలు చేసిన కొన్ని రోజుల తర్వాత ప్రధాని మోడీ నుంచి యూనస్‌కి హెచ్చరిక లాంటి సూచన రావడం గమనార్హం. ఇటీవల ఈశాన్య రాష్ట్రాలలోకి మీ ప్రభావాన్ని విస్తరించాలని చైనాను యూనస్ కోరుతున్న వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. యూనస్ తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా, మోడీ–యూనస్ భేటీలో బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ నిబద్ధతను ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. గతేడాది షేక్ హసీనా పదవి నుంచి దిగిపోయినప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు జరిగాయి. ఈ దాడుల పట్ల భారత్ తన అభ్యంతరాన్ని బంగ్లాదేశ్‌కి తెలిపింది. దాడులను అడ్డుకోవాలని సూచించింది. ఈ భేటీలో ప్రజాస్వామ్య, స్థిరమైన, శాంతియుత, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారతదేశం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌తో సానుకూల మరియు నిర్మాణాత్మక సంబంధాన్ని ఏర్పరచుకోవాలనే భారతదేశం ఆకాంక్షను ప్రొఫెసర్ యూనస్ నొక్కిచెప్పారని మిస్రి అన్నారు. సరిహద్దు భద్రతపై ఇద్దరు నేతలు చర్చించారు.

## వక్ఫ్ బిల్లు ఆమోదంపై ప్రధాని హర్షం

(మొదటి తరువాయి)

అనంతరం లోక్‌సభ ఆమోదించగా, గురువారం కూడా రాజ్యసభలో 12 గంటల పాటు చర్చించిన తరవాత బిల్లు ఆమోదం పొందింది. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ఇదో చరిత్రాత్మక మలుపు అని హర్షం వ్యక్తంచేశారు. కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్న ఆయన.. తాజా బిల్లుతో ఇన్నాళ్లూ అట్టడుగున ఉండిపోయిన వర్గాలకు మేలు చేకూరుతుందని వ్యాఖ్యానించారు. వారి గళం వినిపించే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించాయి. ముఖ్యంగా ముస్లిం మహిళలు, పేద ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీసింది. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం లభించడంతో వారి హక్కులకు భద్రత లభించినట్లయ్యింది. ఈ బిల్లుతో ఇప్పుడు సామాజిక న్యాయం జరిగే ఓ ఆధునిక యుగంలోకి మనం ప్రవేశిస్తున్నాం. ప్రతి పౌరుడి గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వడానికి మేం కట్టు–బడి ఉన్నాం. ఇదే మార్గంలో పయనిస్తూ బలమైన, సమ్మిళిత భారత్‌ను కలిసి నిర్మిద్దామని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రస్తుతం బిమ్‌స్టెక్ సదస్సు నిమిత్తం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. వక్ఫ్ సవరణ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ఓ చరిత్రాత్మక మలుపు అని పేర్కొన్నారు. సామాజిక,ఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం మన సమష్టి అన్వేషణలో ఓ కీలక ఘట్టం అని అభివర్ణించారు. ఇలాంటి చట్టాల బలోపేతం కోసం సహకరించిన కమిటీ సభ్యులు, చర్చల్లో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులకు కృతజ్ఞతలుతెలిపారు. ఇందులో సవరణల కోసం పార్లమెంటరీ కమిటీకి తమ విలువైన సూచనలు పంపిన పౌరులకు ప్రత్యేక ధన్యవాదాలని ప్రధాని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియట్ మూల్యాంకనం

(మొదటి తరువాయి)

ఎంతో పకడ్బందీగా ఈ సారి ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహిస్తున్న ఇంటర్ బోర్డు మూల్యాంకనం విషయంలోనూ తగు చర్యలు తీసుకుంటుంది. మూల్యాంకనం విషయంలో ఇంటర్‌బోర్డు ముందస్తు పునఃపరిశీలన చేయనుంది. సాధారణంగా ఫలితాలు వచ్చిన తర్వాత మార్కులు రాలేదని, అధ్యాపకులు చేసిన తప్పిదం వల్లే తాము ఫెయిల్ అయ్యామని విద్యార్థులు ఆరోపిస్తుంటారు. ఈ నేపథ్యంలో 35 మార్కులు రాని విద్యార్థులకు సంబంధించి జవాబుపత్రాలను చీఫ్ ఎగ్జామినర్, సబ్జెక్టు నిపుణులతో ర్యాండమ్‌గా పునఃపరిశీలిస్తున్నట్లు బోర్డు వర్గాలు తాజాగా తెలిపాయి. దీంతో విద్యార్థులకు మార్కుల విషయంలో ఎలాంటి అన్యాయం జరగకుండా ఉంటుందని చెబుతున్నారు. ఈ మేరకు ఏప్రిల్ 10వ తేదీ నాటికి జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికానుండగా.. ఎప్పటికప్పుడు విద్యార్థుల జవాబు పత్రాలను అధికారులు పునఃపరిశీలిస్తున్నారు. ఇక ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ చివరి వారంలోగా వెల్లడించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తుంది.

## గ్రూప్-1 నియామకాలకు లైన్‌క్లియర్

(మొదటి తరువాయి)

కొట్టివేసింది. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న తెలంగాణ ప్రభుత్వం జీవో 29ని జారీ చేసింది. దీనిని రద్దు చేయాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా పిటిషన్ కొట్టివేతతో గ్రూప్ 1 నియామకాలకు అడ్డంకి తొలగింది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది. త్వరలో 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన చేయనుంది.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్. గౌతమ్ రావు

(మొదటి తరువాయి)

బీజేపీ హైకమాండ్. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్ పదవీకాలం మే 1తో ముగియనుంది. దీంతో కొత్త ఎమ్మెల్సీ ఎన్నికకు ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు మార్చి 24న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. శుక్రవారం నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ. దీంతో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతం రావు పేరును ఖరారు చేసింది హైకమాండ్. మరికాసేపట్లో గౌతం రావు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరుగనుండగా.. ఏప్రిల్ 9 నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఇక ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏప్రిల్ 25న ఫలితాలను ప్రకటించనున్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వచ్చింది.

## హెచ్‌సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు

(మొదటి తరువాయి)

ఇప్పటికే ప్రభుత్వం ప్రకటన చేసిన విషయం తెలిసిందే. సీఎస్, రెవెన్యూ ,జీహెచ్ఎంసీ,అటవీ ,హెచ్ఎండీఏ ఇతర ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం అయ్యారు. ఒకటి రెండు రోజుల్లో విద్యార్థి సంఘాలు, పౌర సంఘాలు, పర్యావరణ వేత్తలతో మంత్రుల కమిటీ సమావేశం కానుంది. ఈ నెల 16 వరకు నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో నివేదిక తయారీపై సీఎస్ ఫోకస్ పెట్టారు. కంచ గచ్చిబౌలిలో ఎకో పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వ ఆలోచన చేస్తోంది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంకు చెక్ పెట్టడంపై సర్కార్ దృష్టి సారించింది. ఈ క్రమంలోమ శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సీఎస్ శాంతి కుమారి, అటవీ,రెవెన్యూ, హెచ్ఎండిఏ సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా కంచ గచ్చిబౌలి భూముల వివాదం భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు. శనివారం నుంచి మంత్రుల కమిటీ జేఏసీలతో సంప్రదింపులు జరుపనుంది. ఈనెల 16 లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను సుప్రీం కోర్టు కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నివేదిక కోసం సీఎస్ కసరత్తు మొదలుపెట్టారు. కాగా కంచ గచ్చిబౌలి భూముల విషయంలో తమ ఆదేశాలు అమలు చేయకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా బాధ్యులవుతారని, జైలుకు వెళతారని సుప్రీం కోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. అక్కడే చెరువు సమీపంలో తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, దానినే కోరుకుంటే తాము చేసేదేమీ ఉండదని, ఎవరూ సహాయం చేయలేరని హెచ్చరించింది. ఇది తీవ్రమైన అంశమని, చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించింది. ప్రజా ప్రతినిధుల అనర్హత పిటిషన్లను విచారించడానికి సంసిద్ధమవుతున్న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్ ధర్మాసనం దృష్టికి కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని అమికస్ క్యూరీ, న్యాయవాది పరమేశ్వర్ గురువారం ఉదయం తీసుకెళ్లారు.

## తెలుగు పంచాంగం 5/4/2025,శనివారం



సూర్యోదయం & సూర్యాస్తమయం:
సూర్యోదయం: ఉదయం 6:11
సూర్యాస్తమయం: సాయంత్రం 6:26
తిథి:
శుక్ల పక్ష అష్టమి: ఏప్రిల్ 4 సాయంత్రం 8:13 నుండి ఏప్రిల్ 5 సాయంత్రం 7:26 వరకు
శుక్ల పక్ష నవమి: ఏప్రిల్ 5 సాయంత్రం 7:26 నుండి ఏప్రిల్ 6 సాయంత్రం 7:23 వరకు
నక్షత్రం:
పునర్వసు: ఏప్రిల్ 5 ఉదయం 5:20 నుండి ఏప్రిల్ 6 ఉదయం 5:32 వరకు
పుష్యమి: ఏప్రిల్ 6 ఉదయం 5:32 నుండి ఏప్రిల్ 7 ఉదయం 6:24 వరకు
అశుభ సమయాలు (దోష కాలాలు):
రాహుకాలం: ఉదయం 9:15 నుండి 10:46 వరకు
యమగండం: మధ్యాహ్నం 1:50 నుండి 3:22 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 7:49 నుండి 8:38 వరకు
వర్జ్యం: సాయంత్రం 5:26 నుండి 7:03 వరకు
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు):
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:54 నుండి 12:43 వరకు
అమృతకాలం: రాత్రి 3:06 నుండి 4:43 వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:34 నుండి 5:22 వరకు

## అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సామాజికవేత్త నార్మల్ భాస్కర్....



హైదరాబాద్,ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
నూతనంగా ఎమ్మెల్సీగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం క్యాన్సర్ హాస్పిటల్ వద్ద 400 మందికి అన్నదాన నిర్వహించడం జరిగింది. జూబ్లీహిల్స్ లోని బంజారా భవన్ వద్ద వేడుకలకు హాజరైన 800 మందికి ఉచిత మజ్జిగ లస్సి భాస్కర్ కన్స్ట్రక్షన్స్ అధినేత పంపిణీ చేశారు. నార్మల్ భాస్కర్ పంపిణీ చేశారు. జరగబోయే క్యాబినెట్ ఇస్తానని‌లో అద్దంకి దయాకర్ కు మంత్రి పదవి రావాలని జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంజారా భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ రావు గారు సుదర్శన్ , నరేందర్, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

# పరిధికి మించి వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు





-రంగారెడ్డి జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరిక
-షాద్ నగర్ లో నాలుగు క్లినిక్ లు సీజ్
-పలు క్లినిక్ లకు షోకాజ్ నోటీసులు
-ఆర్ఎంపీలు, పీఎంపీలు డాక్టర్ అనే పదాన్ని వాడకూడదు
-వైద్యశాల, ప్రజా వైద్యశాల, ఆసుపత్రి అనే పేర్లతో బోర్డులు పెట్టకూడదు


షాద్ నగర్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తమ పరిధికి మించిన వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో స్థానిక డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి తదితర సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు జరిపారు. పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్న నాలుగు ఆర్ఎంపి పిఎంపి క్లినిక్ లను తనిఖీ చేసి సీజ్ చేశారు. పట్టణంలో నిర్వహిస్తున్న కీర్తి పాలీ క్లినిక్, ప్రజా వైద్యశాల, రాజా మెడికల్ హాల్ వెనుక భాగంలో ఉన్న దవాఖాన, మనిశ్విని క్లినిక్ లను సందర్శించి డాక్టర్ వెంకటేశ్వరరావు వాటిని సిస్ చేశారు. కీర్తి క్లినిక్ పై డాక్టర్ రాజు అని పేరు రాసుకోవడం జరిగిందని ఇది తప్పని డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు క్లినిక్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రాథమిక వైద్యం చేయకుండా ఇష్టం వచ్చినట్లు పరిధి దాటి మరి కొందరు వైద్యం చేస్తున్నారని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. పరిధికి మించి వైద్యం చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని అన్నారు. ఆర్ఎంపీలు పీఎంపీలు డాక్టర్ అనే పదాన్ని అసలు వాడుకోవద్దని హెచ్చరించారు. ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ఉండాలని, ఎవరు ప్రజా వైద్యశాల వైద్యశాల ఆసుపత్రి అని బోర్డులు పెట్టుకోరాదని హెచ్చరించారు. ఆర్ఎంపీలతో క్వాలిఫై డాక్టర్స్ సైతం ఇక్కడ విలవిలలాడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వారం రోజులపాటు నిరంతరంగా వైద్య ఆరోగ్యశాఖ దాడులు నిర్వహిస్తుందని హెచ్చరించారు. అనుమతి లేని ఆసుపత్రుల్లో బెడ్లు ఉండకూడదని సూచించారు. ఈరోజునుండి షాద్ నగర్ ప్రాంతంలో ఆరోగ్యశాఖ పెద్ద ఎత్తున నిఘా ఏర్పాటు చేస్తుందని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఆర్ఎంపీల నియంత్రణ జరుగుతుందని సూచించారు. అనారోగ్యంతో బాధపడేవారు కేవలం క్వాలిఫై డాక్టర్లను మాత్రమే సంప్రదించాలని అనవసరంగా ఆర్ఎంపీలు పీఎంపీ ల వద్దకు వచ్చి విలువైన వైద్యం చేసుకోకూడదని దీనివల్ల అనేక దుష్పరిణామాలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విజయలక్ష్మి, మాస్ మీడియా అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# ఎంపీలు వద్దిరాజు, సురేష్ రెడ్డిలు ఢిల్లీలో ప్రెస్ మీట్...




న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
వక్ఫ్ సవరణ బిల్లును తాము రాజ్యసభలో వ్యతిరేకించామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్.సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్రలు చెప్పారు. ముస్లింల మనోభవాలను తమ పార్టీ బీఆర్ఎస్ మొదటి నుంచి గౌరవిస్తున్నదని,ఇక ముందు,ఎప్పటికీ కూడా గౌరవిస్తుందన్నారు.
కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి, అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని వారు విమర్శించారు.ఢిల్లీ తెలంగాణ భవన్ శుక్రవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, రవిచంద్రలు విలేకరులతో మాట్లాడారు. ముస్లింలకు వ్యతిరేకమైన వక్ఫ్ సవరణ బిల్లును బీఆర్ఎస్ రాజ్యసభలో వ్యతిరేకించిందని తెలిపారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు సంఖ్యాబలం తక్కువ ఉన్నప్పటికీ ప్రజల పక్షాన పోరాటంలో ముందడుగులో ఉన్నామన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ఎండగడుతున్నదని సురేష్ రెడ్డి, రవిచంద్రలు వివరించారు.ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలన్నింటిని బీఆర్ఎస్ ఎండగడుతున్నదని చెప్పారు.పార్లమెంటులో తమ పార్టీ సంఖ్యాబలం తక్కువ ఉన్నా కూడా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను మాత్రం వ్యతిరేకిస్తూనే ఉన్నామన్నారు.అబద్ధాలతో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ అబద్ధాల పునాదులపైనే ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు.ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న బీజేపీని తాము అడుగడుగునా అడ్డుకుంటున్నామన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింలకు మంచిదని వారు ఆలోచన చేసుంటే రంజాన్ పండుగకు ముందే పార్లమెంటులో ప్రవేశపెట్టి రంజాన్ తోఫా అని చెప్పుకునేవారని అభిప్రాయపడ్డారు.

## ఏసీబీ వలలో ఇరిగేషన్ అధికారి



పఠాన్ చెరు, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):
సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు పరిధిలో అవినీతి ఉదంతం వెలుగుచూసింది. భూమి ఎఫ్‌టీఎల్ (ఫూల్ ట్యాంక్ లెవల్) పరిధిలోకి రాకుండా సర్టిఫికేట్ జారీ చేసేందుకు ఇరిగేషన్ ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) టి. రవికుమార్ ఓ వ్యక్తితో రూ. 7 లక్షల ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం అందింది. అడ్వాన్స్‌గా రూ. 1 లక్ష తీసుకుంటుండగా ఏసీబీ (ఆంటీ-కరప్షన్ బ్యూరో) అధికారులు పకడ్బందీగా ప్లాన్ చేసి, రవికుమార్‌ను రెడ్ హ్యాండుగా పట్టుకున్నారు.

# ఆత్మీయం- అపురూపం

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం






కడ్తాల్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఆనందం ఉద్వేగం ఆప్యాయత పలకరింపులు చిన్ననాటి జ్ఞాపకాలు చిలిపి ముచ్చట్లు సెల్ఫీలు మధురమైన జ్ఞాపకాలతో ఆ ప్రాంతమంతా సందడిగా నెలకొంది కడ్తాల్ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 - 2022, సంవత్సరంలో SSC పూర్తి చేసుకున్న విద్యార్థులు దాదాపు 23 సంవత్సరాల తర్వాత శుక్రవారం మైసిగండి కన్వెన్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి ఒకరినొకరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. తోటి మిత్రుడు కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాడు తాము కూర్చున్న తరగతి గదులు, తాము చేసిన అల్లరి, పాఠశాల ప్రాంగణం గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కరుణాకర్, లక్ష్మణ్, బాలకృష్ణ, బ్రహ్మ, ధర్మ ,రాంగ్య ,శ్రీను, వెంకటేష్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మరియు ద్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్సి నాగరకుంట నవీన్ రెడ్డి



ఫరుక్ నగర్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
రంగారెడ్డి జిల్లా ఫరుక్ నగర్ మండలం కందివనం పిట్టలగడ్డ తాండ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన మరియు ద్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సి నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరయ్యారు. మహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ని దేవస్థాన యాజమాన్యం సాదరంగా ఆహ్వానించారు. ఆంజనేయ స్వామి దేవతా విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక పూజలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు సేవించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు మాజీ సర్పంచ్ లు అమృనాయక్, యాదయ్య,శివ జ్యోతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి, మాహాదేవ్పూర్ రవిందర్ రెడ్డి, మరియు నాయకులు శంకరయ్య గౌడ్,శివ, బాబూనాయక్,లక్ష్మణ్ నాయక్,నరేష్ గౌడ్, బాల్ రాజు,అశోక్ గౌడ్,దినేష్ సాగర్, గుట్ట రాజు, రమేష్, అనుమారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



షాద్ నగర్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)
వాసవి క్లబ్ వాసవి క్లబ్ వనిత షాద్ నగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో అధ్యక్షుడు కల్వ మాణిక్యం, కల్వ మధుప్రియ అధ్యక్షతన స్థానిక బస్టాండ్ లో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధి గా జిల్లా గవర్నర్ సరాబు అనంతం డిపో మేనేజర్ ఉష రాణి,కాబినెట్ సెక్రటరీ వినయ సంతోష, రీజియన్ సెక్రటరీ పెంటపాటి శ్రీనివాస్, పారెపల్లి నర్సింహా,సూరిశెట్టి నర్సింహా, వాడకట్టు విజయ్ కుమార్, బిజినెస్ ఇంచార్జి ఏలుకుర్తి శ్రీనివాస్, గుగ్గిళ్ల బాల రాజేష్, జోన్ చైర్ పర్సన్ గుడుపల్లి వెంకటరమణ, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి కొవ్వూరు నవీన్, కోశాధికారి గుబ్బ సురేష్ మరియు వనిత క్లబ్ ప్రధాన కార్యదర్శి పిన్నం స్రవంతి కోశాధికారి పాపిశెట్టి స్వప్న, జోన్ చైర్మన్ కొండా రమాదేవి వాసవి క్లబ్ మరియు వనిత సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా ఆమనగల్ బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవం





**ఆమనగల్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నూతన కమిటీ సభ్యులు, శాసనపరమైన విధులలోకి అడుగుపెట్టారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా బాధ్యతలు నిర్వహించిన ప్రముఖ సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, మాజి బార్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్ ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, కోర్టు సూపరిండెంట్ మురళీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్ హాజరై, నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అండేకర్ యాదిలాల్ బాధ్యతలు స్వీకరించగా, ఉపాధ్యక్షుడిగా ఏర్పుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దుడ్డు ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా విజయ్ కుమార్, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా ఏ. శేఖర్, కోశాధికారిగా కొప్పు కృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా వస్పుల మల్లేష్ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా నూతన కమిటీకి సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు ఘనంగా స్వాగతం పలికి, పూలమాలలు, గజమాలలు మరియు శాలువాలతో సత్కరించారు. అధ్యక్షుడు యాదిలాల్ మాట్లాడుతూ, బార్ అభివృద్ధి, న్యాయవాదుల హక్కులు, సంక్షేమం కోసం సమర్థవంతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నరేందర్ రెడ్డి సహా, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, వెంకట్ గౌడ్, భాస్కర్ రెడ్డి, జమీల్, జానకిరాములు, కృష్ణయ్య, మల్లేష్ గౌడ్, లక్ష్మణ రాజు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు గణేష్ గౌడ్, సంతోష్, మల్లేష్, దేవేందర్, శేఖర్, బిక్య నాయక్, సర్దార్ నాయక్, మురళీకృష్ణ, శ్రీనివాస్, ఆంజనేయులు, శిరీస్ తదితరులు హాజరయ్యారు.

# పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

## మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్.



**కల్వకుర్తి, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మండల పరిధిలోని లోని గుండూరు గ్రామానికి చెందిన బోడ బీరప్ప అనారోగ్యంతో చనిపోయిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు మృతిని కుటుంబానికి ఓదార్చి,భరోసా కల్పించారుం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాగేంద్రము,నాగయ్య, కృష్ణయ్య,బీరప్ప,మల్లేష్, జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



**వనపర్తి,ఏప్రిల్ 4( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పెద్దమందడి మండలం మద్దిగట్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది గురుకుల పాఠశాల ఎంపిక కొరకు నిర్వహించిన పోటీ పరీక్షలో ప్రభంజనం సృష్టించారు.గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాలలో అద్భుత ప్రతిభ చాటారు.మద్దిగట్ల పాఠశాల విద్యార్థులు ఎంపిక చేసుకున్న మొదటి పాఠశాలలోనే సీట్లు సాధించి నారు,5 మంది విద్యార్థులు ఒకేసారి సీట్లు సాధించడం పై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. సీటుసాధించిన వారిలో ఎమ్.నిషిత బిసి వెల్ఫేర్ వెల్టూర్. కొ.గౌరీ బీసీ వెల్ఫేర్ వెల్టూర్ జె.అక్షయ బీసీ వెల్ఫేర్ వెల్టూర్,ఏ.గణేష్ సోషల్ వెల్ఫేర్ మదనపురం,అఖీధ జనరల్ సొసైటీబాలానగర్ పాఠశాలలో సీట్లు పొందారు.ఈసందర్భంగా విజయం సాధించిన, విద్యార్థులను,ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు మండల విద్యాధికారి బాణం విష్ణు, గైడ్ టీచర్స్ శివరాజ్ బృందం అభినందించారు.

# విత్తనాల పండుగ ప్రారంభం

**కద్తాల్, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తొలి తెలంగాణ వార్షిక విత్తనోత్సవం స్థానిక విత్తనమే కేంద్రంగా, రైతే లక్ష్యంగా వ్యవసాయంలో వచ్చే సమూల మార్పులతోనే నిజమైన హరిత విప్లవం సాధ్యమని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపై ఆ హరిత విప్లవమే మనందరికీ రక్ష అని, విత్తనాన్ని సంకరం చేసి-వ్యవసాయాన్ని రసాయనమయం చేసిన ప్రక్రియ 'హరిత విప్లవం' కాదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ తొలి 'విత్తనాల పండుగ'ను శుక్రవారం ప్రారంభించి ఆయన ప్రసంగించానారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్-సీజీఆర్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల పండుగ కద్తాల్ మండలం, అన్మాస్ పల్లిలో ఈ పండుగ మొదలయింది. కర్ణాటక,రాజస్థాన్, తమిళనాడు,కేరళ తదితర రాష్ట్రాల విత్తనాల నిపుణులు, ఆర్గానిక్ సంస్థలతో 52 స్టాల్స్ తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విత్తనాలు బ్యాంక్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డి సుంకెటి మాట్లాడుతూ సంప్రదాయ విత్తనాలు గ్రామ స్థాయిలో అవగాహనతో విస్తృత పరచాలన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే సహకారం అందిస్తామని తెలిపారు. ఐఏఎస్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యూ రాంపుల్లా రెడ్డి, ఎమినెంట్ సీడ్ కన్జర్వేటర్ (పద్మశ్రీ )రైమతి ఘురియా ఒడిశా,భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ జాకబ్ నెల్లితాన్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్.డా.డి.రాజి రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు డా.దొంతి నరసింహా రెడ్డి, CGR అధ్యక్షులు కె. లీలా లక్ష్మా రెడ్డి, CGR వ్యవస్థాపకులు కె. లక్ష్మా రెడ్డి , రైతులు,విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు, సైంటిస్టులు,డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


విత్తనాల పండుగను ప్రారంభిస్తున్న దృశ్యం

## పలువురికి మాజీల పరామర్శ






**వనపర్తి,ఏప్రిల్ 04(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పెద్దమందడి మండలం అమ్మపల్లె గ్రామ మాజీ సర్పంచ్ విట్టా.పుల్లారెడ్డి ఇటీవల మరణించారు.విషయం తెలిసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగానిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పుల్లారెడ్డి సుదీర్ఘకాలం గ్రామ సర్పంచిగా గ్రామానికి సేవలు అందించారని అటువంటి సేవాభావం కలిగిన నాయకుణ్ణి కోల్పోవడం దురదృష్టకరం అని అన్నారు. అదేవిధంగా మదిగట్ల గ్రామములో అనారోగ్యం(పక్షవాతం)తో బాధపడుతున్న ఉద్యమకారుడు శాంతిరెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.అనంతరం బి.ఆర్.ఎస్ నాయకులు ప్రసాద్ సాగర్ గృహప్రవేశంలో పాల్గొని ప్రసాద్ నూతనంగా కొన్న కోడెలను తిలకించి అభినందించారు.నిరంజన్ రెడ్డివెంట రఘుపతి రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిలింగం,కుమార్ యాదవ్,శివారెడ్డి,రఘువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు .రావుల పరామర్శ.వనపర్తి 23వ వార్డుకు చెందిన శారద విద్యామందిర్ వ్యవస్థాపక సభ్యులు,ఉపాధ్యాయురాలు శ్రీమతి వి.యస్.కళావతి ఇటీవల గుండెపోటుతో మరణించారు.విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుమారులు శ్రీను,మురళీ, పాండులను పరామర్శించి ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.రావులవెంట నందిమల్ల.అశోక్,ఉంగ్లం. తిరుమల్,నందిమల్ల.రమేష్, జోహే బ్ హుస్సేన్,సునీల్ వాల్మీకి,తోట.శ్రీను ఉన్నారు.

# మాజీ మంత్రికి ఆహ్వానం

**-సాయి నగర్ కాలనీ హనుమాన్ భక్త బృందం**



**వనపర్తి,ఏప్రిల్ 4( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణంలో ఆదివారం రోజున శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో కళ్యాణ కార్యక్రమానికి హజరవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికిఆహ్వాన పత్రిక అదించిన దేవాలయ కమిటీ సభ్యులు గౌనూరు వెంకట్ స్వామి , బాలిశ్వరయ్యా ,బాలప్పా ఆహ్వానం పత్రిక ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్,ఉంగ్లమ్ తిరుమల్, కంచే రవి,రవిప్రకాష్ రెడ్డి, ప్రేమ నాథ్ రెడ్డి,శేఖర్ గౌడ నాయక్ చిట్యాల రాము,తదితరులు పాల్గొన్నారు.

## కొండ భీమనపల్లిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



**దేవరకొండ, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామంలోని 37వ రేషన్ దుకాణంలో రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శ్రీకాంత్, డీలర్ మునుకుంట్ల విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పేదల కోసం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం వారికి వరంగా మారిందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపారని, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలైన సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆలోచనల ఫలితంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సువర్ణయుగం కొనసాగుతోందని వారు అభిప్రాయపడ్డారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యమా అంశంపై బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో చర్చ గోష్టి...

**హాజరుకానున్న చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య...**
**-వివరాలు వెల్లడించిన.... గోరా శ్యాంసుందర్ గౌడ్**

**హైదరాబాద్,ఏప్రిల్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
చర్చకు వస్తుంది చట్టం చేయకుండా బీసీ లకు 42% రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యమా, రాష్ట్ర ప్రభుత్వము జీవో ఇస్తే సరిపోతుందా, బిసి రిజర్వేషన్ల అమలు కు ఉన్న అడ్డంకులు ఏమిటి అనే అంశాల మీద బీసీ మేధావులు రాజ్యాంగ నిపుణులు అధికారులు వివరిస్తారు. బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఐదవ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బీసీ రిజర్వేషన్ల అమలుపై అవగాహన సదస్సు జరగనున్నది. సభాధ్యక్షులు గా టి.చిరంజీవులు చైర్మన్ బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం వివరించనున్నారు. ఈ కార్యక్రమంలోముఖ్య వక్తలు గా జస్టిస్ ఈశ్వరయ్య మాజీ చైర్మన్ జాతీయ ఓబీసీ కమిషన్, విల్సన్ ఎంపీ తమిళనాడు, బిఎస్ ప్రసాద్ మాజీ అడ్వకేట్ జనరల్ తదితరులు వివరిస్తారు. ఈ మేరకు జిల్లా బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం రంగారెడ్డి కో-ఆర్డినేటర్, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోరా శ్యాంసుందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం

**-ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం**

**-గసన్న బియ్యం పంపిణీ చేసిన మంత్రి. జూపల్లి కృష్ణా రావు**



**వనపర్తి,ఏప్రిల్ 04(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పేద ప్రజలు సైతం సన్న బియ్యంతో భోజనం చేయాలి అనే ఉన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లాలోని పాన్గల్ మండలంలో రేమద్దుల, కిస్టాపూర్ తాండా, గోప్లాపూర్, అన్నారం గ్రామంలో జాతీయ ఆహార ఉత్పత్తి కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు రేషన్ షాపు ద్వారా పేదలకు ఉచితంగా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే వాటిని తక్కువ ధరకు అమ్ముకునే వారని అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుల పై ఉచితంగా నాణ్యమైన సన్న రకం బియ్యాన్ని పంపిణీ చేసే అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సర కాలంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ కింద పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఎకరాకు 5000 ఉన్న రైతు భరోసా ను 6000 కు పెంచి రైతుల ఖాతాల్లో జమ చేయడం , రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ, 500 రూపాయలకే సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు తదితర ఇచ్చిన గ్యారంటీలను నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడినాటికి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పటి ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చి పోయిందన్నారు. 65 సంవత్సరాల్లో 21 మంది ముఖ్యమంత్రి కేవలం 64 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తే గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో 8 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయిందని వెల్లడించారు. ఈ అప్పులకు ప్రతినెల వడ్డీ చెల్లించడానికి 6,000 కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇన్ని ఆర్థిక బదులు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందజేయడం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రావడం జరిగింది అన్నారు. అర్హులైన వారికి మండలంలో ఎవరికైనా 2 లక్షల లోపు రుణమాఫీ కానీ వారు, 200 వరకు ఉచిత కరెంట్, 500కు సిలిండర్ రాని వారు దరఖాస్తులు ఇవ్వాలని, రాకపోవడానికి గల కారణాలు అధికారుల నుండి తెలుసుకొని అర్హత ఉంటే తప్పకుండా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కొరకు ఎవరికి లంచం ఇవ్వరాదని ప్రజలకు సూచించారు. కొల్లాపూర్ తాలూకాకు 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని జనాభా ప్రాతిపదికన అన్ని మండలాలకు గ్రామాలకు పంచడం జరుగుతుందని తెలియజేశారు. ఈసారి ఎవరికైన రాణిపక్షంలో మలి విడతలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ప్రజలు ఎప్పటి నుంచో ఎంతో కష్టపడుతున్న ప్రభుత్వం నుంచి ఎన్ని ఆర్థిక సహకారాలు అందిస్తున్న ఇంకా పేదవారుగానే మిగిలిపోతున్నారని అందుకు గల కారణం విద్య, వైద్యం, ఫంక్షన్లకు ఖర్చు చేయడమేనని వెల్లడించారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉచితంగా పాఠాలు చెబుతున్నప్పటికీ ప్రైవేట్ పాఠశాలకు పంపించి వేల రూపాయలు నష్టపోతున్నారని,అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రులకు, ఫంక్షన్ లకు ఖర్చు చేసి అప్పుల్లో మునిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు మేలుకోవాలని, సరైన నిర్ణయం తీసుకొని ప్రతి రోజు గంట సేపు వ్యాయామం, మంచి భోజనం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.మండలంలో ఉన్న సమస్యలు అన్ని అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి.యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, పి.డి. డి ఆర్ డి ఓ ఉమాదేవి జిల్లా పౌరసరఫరాల అధికారి విశ్వనాథ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, పానగల్ తహసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో గోవిందరావు, మండల అధికారులు ,ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ యూత్ అవార్డు అందుకున్న శివ కుమార్..

**ఢిల్లీ పార్లమెంట్ లో అత్యుత్తమ యువ పురస్కారం అందజేత**




**కల్వకుర్తి, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్ కు భారత దేశంలో యువతకు అందించే అత్యుత్తమ నేషనల్ యూత్ అవార్డు ను ఢిల్లీ పార్లమెంట్ లో భారత యువజన మరియు క్రీడా సర్వీసులు శాఖ క్యాబినెట్ మంత్రి మన్సుఖ్ మండవియా చేతుల మీదగా ప్రధానం చేసారు. 2022-23 సంకు గాను దేశంలో 12 మంది యువతకు అందించిన అవార్డులో శివకుమార్ కు చోటు దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణం అని పలువురు అభినందనలు తెలియజెస్తున్నారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లోను కలిపి నేషనల్ యూత్ అవార్డు శివ కుమార్ కే అవార్డు రావడం ప్రత్యేకం. శివ కుమార్ గత 13 సం గా పర్యావరణ, యువత చైతన్యం, నిరుపేదలకు అందించిన సేవలు, వ్యవసాయ లో రైతులకు శివ అగ్రి క్లినిక్ సోషల్ మీడియా ద్వారా అందించిన కృషి, సామజిక చైతన్యం పై అనేక కార్యక్రమలు, అవయవధానం వంటి కార్యక్రమలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు అని తెలిపారు. పార్లమెంట్ లో శివ కుమార్ కు అవార్డు ప్రధానం కార్యక్రమంలో తన సేవలను అందరి ముందు ప్రస్థావిస్తూ ఘనంగా అవార్డు అందజేశారు. శివ కుమార్ కు అవార్డు ప్రధానం చేసిన వారిలో యువజన క్రీడా సర్వీసులు శాఖ సహాయ మంత్రి రక్షా ఖాడ్సే,జాతీయ యువజన క్రీడా శాఖ సెక్రటరీ మీట రాజీవ్ లోచన్,జాయింట్ సెక్రటరీ నితీష్ కుమార్ మిశ్రా అధికారులు తదితరులు అందజేశారు.

# పాఠశాల విద్యపై ముఖ్యమంత్రి సమావేశం, కృతజ్ఞతలు తెలిపిన టిఆర్టిఎఫ్ ...

**హైదరాబాద్,ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** చాలా సంవత్సరాల తర్వాత ముఖ్యమంత్రి స్థాయిలో రాష్ట్రంలో ప్రాథమిక విద్యపై, సమీక్షలు సమావేశాలు, కమిషన్లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యపై ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ హర్షం ప్రకటించింది. గతంలో కన్నా ప్రస్తుత ప్రభుత్వం ఏదో ఒకటి చేయాలని, ప్రత్యేక సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక విద్య పురోగతికి ఇది దోహక పడుతుందని పేర్కొంది. పాఠశాల విద్య అంటే పదో తరగతి మాత్రమే అనే దృష్టి నుండి ప్రాథమిక విద్య బలోపేతం ఒకటి నుంచి ఐదు తరగతులు, ముఖ్యంగా పూర్వ ప్రాథమిక విద్య ద్వారానే గుణాత్మకమైన, నాణ్యమైన విద్యను, అందించవచ్చని గత చాలా సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ గా చెప్తున్నది. వివిధ జిల్లాలలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ గా విద్యా కమిషన్ కూడా సమర్పించింది. ముఖ్యమంత్రి ప్రాథమిక విద్యా బలోపేతం ద్వారానే గుణాత్మకమైన విద్య నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని పేర్కొంటాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి ఈనాటి సమావేశంలో పాల్గొన్న అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తుంది. భవిష్యత్తు ప్రాథమిక విద్య బలోపేతానికి తెలంగాణ రాష్ట్ర టీషర్ట్స్ ఫెడరేషన్ తమ సూచనలను సలహాలను తెలియపరుస్తూ ప్రభుత్వ ఆలోచనలకు అండగా నిలుస్తుందని ఈ విషయంలో పేర్కొన్నారు.

# సంగారెడ్డి జిల్లా బిజెపి పదాధికారుల సమావేశం...

**-పాల్గొన్న ఎమ్మెల్సి చిన్నమైల్ అంజి రెడ్డి, బిజెపి స్థాపన దివాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జూటూరు కీర్తి రెడ్డి ...**




**సంగారెడ్డి, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సంగారెడ్డి జిల్లా బిజెపి పదాధికారుల సమావేశానికి ముఖ్య అతిధిగా, ఎమ్మెల్సి చిన్నమైల్ అంజి రెడ్డి తో కలసి బిజెపి రాష్ట్ర నాయకురాలు, స్థాపన దివాస్ రాష్ట్ర కమిటీ మెంబర్ జూటూరు కీర్తి రెడ్డి పాల్గొన్నారు. ఏప్రిల్ 6 తారీఖున జరిగే బీకేపీ పార్టీ ఆవిర్భావ సంబరాలు పై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు శాంతి కుమార్, రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సంగప్ప, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి స్వేరోస్ డివిజన్ అధ్యక్షుడిగా వట్టేపు కిషోర్ నియామకం.



**కల్వకుర్తి, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం స్వేరోస్ రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో వట్టేపు కిషోర్ ను కల్వకుర్తి డివిజన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన కిషోర్ కు నియామక పత్రాన్ని స్వేరోస్ రాష్ట్ర నాయకులు అశ్విన్ కుమార్,దుబ్బ నాగేష్ అందించారు. ఈ సందర్భంగా వట్టేపు కిషోర్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో డివిజన్ అధ్యక్షుడిగా నియమించిన స్వేరోస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.తనకి ఇచ్చిన పదవికి న్యాయం చేసే విధంగా,మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ,బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం,పేద విద్యార్థులను అక్షరమే ఆయుధంగా మలచి ముందుకు సాగుతూ తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.సమాజంలో ఎదగాలని నిరంతరం శ్రమిస్తున్న ఆర్.యస్ ప్రవీణ్ కుమార్ గారి అడుగుజాడల్లో నడుస్తాని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల రమేష్, స్వేరస్ సీనియర్ నాయకులు జంగిలి నిరంజన్ , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్, సోషల్ మీడియా ఇంచార్జ్ సంపత్ కుమార్, వంగూరు మండల అధ్యక్షులుదార్ల కాశన్న, కల్వకుర్తి పట్టణానికి స్వేరోస్ ఇంచార్జ్ నెరటి మల్లేష్, మబ్బు బాను ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల విస్తృత తనిఖీలు



**వెల్దండ, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలో శుక్రవారం రోజు స్థానిక పోలీసు స్టేషన్ దగ్గర మరియు శ్రీశైలం హైవేపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను సీఐ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎస్సై కురుమూర్తి పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది చేపట్టారు. ఈ తనిఖీల ద్వారా హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు, శ్రీశైలం వెళ్లే భక్తులకు భద్రతా భరోసా కల్పిస్తూ ప్రజలను పోలీసులు సానుకూల దృక్పథంతో అండగా నిలుస్తున్నారు. ఇలాంటి చర్యల వల్ల సంఘవిద్రోహ శక్తులను అరికట్టవచ్చని పోలీసుల అభిప్రాయం. పోలీసులు ప్రజల పట్ల అప్రమత్తంగా ఉండడం ద్వారా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడంలో సహాయం లభిస్తుందని, ఈ విధానానికి ప్రజల నుండి విశ్వాసం పెరుగుతోందని విశ్లేషించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, సమాచారం సేకరించడంలో ప్రజల సహకారం కీలకమని పోలీసులు అభిప్రాయపడ్డారు.

# రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్..
# ఉద్యోగుల భద్రతకు భరోస





- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలం
- అప్పన్లతో వస్తున్న జీపీవోలు సర్వీసు పరమైన అభద్రతకు గురికావద్దు
- గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం
- రైతులకు మెరుగైన సేవలు, ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు
- 10,954 మంది జీపీవోల నియామకంతో రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు
- గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పంను నెరవేర్చే బాధ్యత జీపీవోలదే
- సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందించేందుకు మనందరం పునరంకితం కావాలి
- దేశ చరిత్రలో తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సృష్టించాము
- భూభారతి చట్టంలో తహశీల్దార్లు, ఆర్డీఓలు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాల వికేంద్రీకరణ
- సీఎం రేవంత్ రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి...



**కరీంనగర్,ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులోనే ఓ భరోస దొరుకుతుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ అంశంపై త్వరలోనే ప్రభుత్వ పెద్దలు ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ అప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి వస్తున్న జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)లు సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జీపీవో పోస్ట్ కొత్తగా క్రియేట్ చెసిందని, అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే పదోన్నతులు వస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణమైతుందన్నారు. అప్షన్ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కామన్ సర్వీస్ ఉంటుందన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి వచ్చిట్లుగానే ప్రతి జీపీవోకు పదోన్నతులు వస్తాయన్నారు. ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. రాష్ట్రంలో రైతులకు మెరుగైన సేవలు అందడంతో పాటు, రెవెన్యూ ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు వస్తున్నాయన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారులను నియామకం చేయడం వలన రైతులకు రెవెన్యూ సేవలు చెరువ కావడంతో పాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు లభిస్తున్నాయన్నారు. దీంతో క్రమంగా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. అయితే భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే%శీ%దుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. భూ భారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం కావడంతో పాటు రైతులకు గ్రామ స్థాయిలోనే భూ సమస్యలు పరిష్కారం ఆవుతాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత అప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆకాంక్షకు ప్రభుత్వ సహకారం తోడవడంతో రెవెన్యూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సాదించుకున్నామన్నారు. అయితే రాష్ట్రంలో లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు అత్యంత బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామన్నారు. అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు. కానీ త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టంలో తహశీల్దార్లకు ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు.

భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. జీపీవోల వలన రైతులకు గ్రామ స్థాయిలో సేవలు అందడంతో పాటు సత్వర సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వం ఒకవైపు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేస్తూనే... మరోవైపు రైతులకు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలను క్షేత్రస్థాయిలోనే అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్

బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఉదయం ప్రజాభవన్ లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సీఎం కు వివరించడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ తో పాటు రాష్ట్ర స్థాయిలో మా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ అనివార్యత ను వివరించడం జరిగిందని తెలిపారు.

జేఏసీ వినతిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు, రాష్ట్ర మంత్రివర్గం, రెవెన్యూం శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ గారు మరియు ప్రభుత్వ పెద్దల, ఇతర ఉన్నతాధికారులందరి సహకారంతో అనతి కాలంలోనే అనేక చారిత్రిక విజయాలను తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సొంతం చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కొండంత అండగా నిలిచిన ప్రభుత్వానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్న అన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అన్ని శాఖల ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో అనేక విజయాలు సాధించి రెట్టించిన ఉత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సంక్షేమానికి పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. వీటితో పాటు రెవెన్యూ ఉద్యోగులుగా మనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మనం కోరుకుంటున్న సంక్షేమం, ఇతర శాఖాపరమైన పదోన్నతులు, బదిలీలు మరియు సీనియారిటీ అంశాల గురించి మనమంతా ఒక చోట కలిసి చర్చించుకోవాల్సిన సందర్భం ఆసన్నమైందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకొని మనందరం ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. సమీప భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించుకుంటామని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి దీమా వ్యక్తం చేశారు.

**క్షేత్రస్థాయికి రెవెన్యూ సేవలు...**

గతంలో తెలంగాణ ప్రాంతంలో రెవెన్యూ వ్యవస్థ గ్రామ సచివాలయ కేంద్రంగా ఉండేదని, భూ రికార్డులు కూడా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఉండేవన్నారు. రైతులకు ఏ భూ సమస్య వచ్చినా గ్రామ స్థాయిలోనే పరిష్కారం అయ్యేదని, కానీ ఎన్టీఆర్ ప్రభుత్వంలో రెవెన్యూ పరిపాలన సంస్కరణలతో పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ వ్యవస్థను మండల కేంద్రాలకు మార్చారన్నారు. తదనంతరం రాజశేఖర్ రెడ్డి మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించారన్నారు. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన భూ సంస్కరణలతో ఏకంగా భూ సమస్యల పరిష్కార వేదిక జిల్లా కేంద్రానికి చేరడంతో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం అన్నారు. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ గ్రామీణ స్థాయి రెవెన్యూ వ్యవస్థ క్రమంగా బలోపేతం అవుతుందని లచ్చిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

తక్కువ సమయంలోనే ఎక్కువ విజయాలు... డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణలి

తక్కువ సమయంలోనే ఎక్కువ విజయాలు సాదించామని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ అన్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్యను పెంచడం, గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామానికో అధికారి చొప్పున 10,954 జీపీవో పోస్టుల ఏర్పాటు మనకు అతిపెద్ద విజయాలని ఆయన అభివర్ణించారు. అలాగే వేరువేరు జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సుమారు 10 ఏళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించడం జరిగిందన్నారు.

**గతంలో రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నం- టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి**

గతంలో రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందన్నారు.

అలాగే జీఓ నం.317 రాష్ట్రంలో ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్ లు ఇచ్చారన్నారు. వీఆర్వో, వీఆర్ఏ జీవితాలను చిన్నాభిన్నం చేశారన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా ఉద్యోగుల ఆంక్షలను, 317 జీవోలోని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు. ముఖ్యంగా స్పోజ్, మెడికల్, తదితర కోణాలలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిందన్నారు. 61 సంవత్సరాలు పై బడిన వీఆర్ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, అలాగే కారుణ్య నియామకాలను చేపట్టేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాము. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి వెంకట్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు చల్ల శ్రీనివాస్, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రాధ, సీసీఎల్ఏ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ చైతన్య, రాంబాబు, కోశాధికారి మల్లేశం, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షులు సుజాత చౌహాన్, టీజీటీఏ ఉపాధ్యక్షులు పాల్ సింగ్, పూర్వపు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్ రావు, కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఉమ్మడి కరీంనగర్ నగర్ జిల్లా టీజీటీఏ అధ్యక్ష, కార్యదర్శులు, టీజీఆర్ఎస్ఏ అధ్యక్షులు రాముడు, ఆనంద్, మురళి, తహసీల్దార్లు నరేందర్ గౌడ్, రాజేశ్వరి, సుజాత, పుష్పలత, సరిత, డిప్యూటీ తహసీల్దార్ కిషన్, టీజీఆర్ఎస్ఏ నాయకులు సీహెచ్ భూమయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ కే. విష్ణు, నాయకులు నరేందర్, కిరణ్ కుమార్ రాకేష్, పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

# తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న పుట్టబొమ్మ




**అమరావతి, ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని టాలీవుడ్ స్టార్ నటి బుట్ట బొమ్మ పూజా హెగ్డే దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న నటికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతంపలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు నటిని శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు పూజా హెగ్డే తిరుపతి జిల్లాలోని ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న విషయం తెలిసిందే. గురువారం ఉదయం శ్రీ కాళహస్తికి వెళ్లిన నటి.. అక్కడ రాహుకేతు పూజలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవిని దర్శించుకున్నారు. సినిమాల విషయానికి వస్తే.. పూజా ప్రస్తుతం దళపతి విజయ్‌తో జననాయగన్ సినిమాలో నటించడంతో పాటు సూర్య హీరోగా వస్తున్న రెట్రో చిత్రంలో కథానాయికగా నటిస్తుంది.

# వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ పార్టీ



**న్యూఢిల్లీఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీజేపీ సర్కారు తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ఆ బిల్లు పాసైన విషయం తెలిసిందే. ఆ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అయితే ఆ బిల్లుకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లనున్నట్లు ఇవాళ కాంగ్రెస్ పార్టీ నేత జయరాం రమేశ్ తెలిపారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో ట్వీట్ చేశారు. 2019లో ప్రభుత్వం తెచ్చిన సీఏఏను సుప్రీంలో సవాల్ చేశామని, 2005 ఆర్టీఐ చట్టం సవరణను ప్రశ్నిస్తూ సుప్రీంలో సవాల్ చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ అంశంపై తెచ్చిన సవరణలను ప్రశ్నిస్తూ కూడా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పార్టీ కేసు ఫైట్ చేస్తోందన్నారు. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం అమలను నిలదీస్తూ కూడా సుప్రీంలో కేసు వేశామన్నారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టులో పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు.

# టికెట్ సేల్స్ ద్వారా ఆదాయం.. టాప్‌లో తాజ్‌మహల్



**న్యూఢిల్లీ ఏప్రిల్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మొఘల్ కాలం నాటి తాజ్‌మహల్ కు విశేష ఆదరణ ఉన్న విషయం తెలిసిందే. ఆ పాలరాతి కట్టడాన్ని తిలకించేందుకు రోజూ వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. యూపీలోని ఆగ్రాలో ఉన్న ఆ కట్టడాన్ని చూసేందుకు విదేశీ పర్యాటకులు కూడా భారీ సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం ఆ సుందర కట్టడం .. పురావాస్తు శాఖ ఆధీనంలో ఉన్నది. అయితే గత అయిదేళ్లలో పర్యాటకులు ఆ అద్భుత కట్టడాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో వచ్చారు.పురావాస్తు శాఖ ఆధీనంలో ఉన్న నిర్మాణాల్లో.. అత్యధికంగా టికెట్ సేల్స్ జరుగుతున్న వాటిల్లో తాజ్‌మహల్ అగ్రస్థానంలో ఉన్నది. పర్యాటకులకు టికెట్లు అమ్మి, ఆదాయం ఆర్జిస్తున్న ఏఎస్ఐ ఆధీనంలోని కట్టడాల్లో తాజ్‌మహల్ మొదటి స్థానంలో ఉన్నట్లు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత అయిదేళ్లలో వివిధ ఏఎస్ఐ నిర్మాణాల నుంచి టికెట్ల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం ఎంతో చెప్పాలని మంత్రిని ఓ సభ్యుడు కోరారు. అయితే పురావాస్తు శాఖ ఆధీనంలో ఉన్న సైట్లకు చెందిన డేటాను మంత్రి సభలో ప్రజెంట్ చేశారు. 2019 నుంచి 2024 వరకు పురావాస్తు కట్టడాల నుంచి వచ్చిన ఆదాయాన్ని మంత్రి సభకు సమర్పించారు. ఆ జాబితా ప్రకారం టాప్‌లో తాజ్‌మహల్ ఉన్నది. ఇక ఆదాయం ఎక్కువ వస్తున్న ఏఎస్ఐ కేంద్రాల్లో.. ఆగ్రాలోని ఆగ్రా ఫోర్ట్, ఢిల్లీలోని కుతుబ్ మినార్, తమిళనాడులోని మామల్లపురం, కోణార్క్‌లోని సన్ టెంపుల్ ఉన్నాయి.